
సాక్షి ఒడిశా

మంగళవారం । 9 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,42,054 లు. బంగారం 20గ్రాము 620 మిల్లీగ్రాములు. వెండి 55 గ్రాములు 550 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సందడే.. సందడి

పర్లాకిమిడి సెయింట్ జోసెఫ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు సోమవారం సందడిగా నిర్వహించారు.

- 8లో



మల్కన్‌గిరి ఎయిర్ పోర్టు ప్రారంభం నేడు

మల్కన్‌గిరిలో నిర్మించిన నూతన ఎయిర్ పోర్టు సీఎం నవీన్ పట్నాయక్ చేతులమీదుగా మంగళవారం ప్రారంభమవ్వనుంది.

- 8లో

సర్వం సిద్ధం



ప్రొఫెసర్ యుటే హోకర్ (యూనివర్సిటీ ఆఫ్ కలోన్, జర్మనీ)



ప్రొఫెసర్ కిషోర్ పాణిగ్రాహి



ప్రొఫెసర్ కరేన్ హాలిదే (యూనివర్సిటీ ఆఫ్ కలోన్, జర్మనీ)



ప్రొఫెసర్ చందన్ గోస్వామి



ప్రొఫెసర్ క్రిస్టియన్ ఫ్యాంకజర్ (యూనివర్సిటీ ఆఫ్ లౌసనే, స్విట్జర్లాండ్)



పఠాణి సామంత ఆడిటోరియం

- నేటి నుంచి మొక్కలపై విజ్ఞానవేత్తల సదస్సు
- సరికొత్త పరిశోధనలపై చర్చ
- హాజరవ్వనున్న ప్రపంచ దేశాల శాస్త్రవేత్తలు

భువనేశ్వర్:

స్థానిక జాతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ నైజర్ ప్రాంగణంలోని పఠాణి సామంత ఆడిటోరియం జాతీయ, అంతర్జాతీయ విజ్ఞానవేత్తలకు వేదికగా సిద్ధమైంది. మొక్కల ఫొటో బయాలజీ రంగంలో అంతర్జాతీయ సదస్సు మంగళవారం నుంచి ప్రారంభమవ్వనుంది. ఈనెల 12వ తేదీ వరకు మొత్తం 4 రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుంది. ఇది మొక్కల బయాలజీపై 11వ అంతర్జాతీయ సింపోజియం (ఐఎస్‌పీపీ) కావడం విశేషం.

ఆవిర్భావం

తొలిసారిగా సంయుక్త రాష్ట్ర అమెరికాలో 2001 సంవత్సరంలో ఫొటో బయాలజీపై అంతర్జాతీయ సింపోజియం (ఐఎస్‌పీపీ) ప్రారంభమైంది. ప్రపంచ దేశాల్లో ద్వైవార్షిక సదస్సుగా కొనసాగుతోంది. ఆసియా, అమెరికా, ఐరోపా శాస్త్రవేత్తల మధ్య వివిధ ప్రముఖ సమూహాలు తీసుకున్న విభిన్న జీవ సంబంధ సమస్యలను పరిష్కరించడానికి, తాజా సాంకేతికతలు, విధానాలను మార్పిడి చేసుకోవడానికి ఈ అంతర్జాతీయ సదస్సు దోహదపడుతుంది. యూరోపియన్ మాలిక్యులర్ బయాలజీ ఆర్గనైజేషన్ (ఎంబో) – జర్మనీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీ (డీఏఈ), జాతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ (నైజర్), భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఐసీఏఆర్, సీఎస్ఐఆర్, ఎస్ఈఆర్‌బీ, డీబీటీ, ఐఎస్ఎస్‌పీ సౌజన్యకర్తలుగా ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నారు.

300 మంది ప్రతినిధులు హాజరు

సదస్సుకు దేశ, విదేశాల నుంచి 300 మంది పైబడి వైజ్ఞానిక ప్రతినిధులు విచ్చేస్తున్నారు. 17 ప్రపంచ దేశాల నుంచి సుమారు 80 మంది అంతర్జాతీయ పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొని యువ వైజ్ఞానికులకు మార్గదర్శకాలు సూచిస్తారని ఐఎస్‌పీపీ కన్వీనర్ ప్రొఫెసర్ కిషోర్ పాణిగ్రాహి తెలిపారు. ఈ నేపథ్యంలో వర్ధమాన వైజ్ఞానిక యువతతో ప్రత్యేకించిన అంశాలపై సుదీర్ఘంగా 3 నుంచి 4 గంటల పాటు చర్చించి పరిశోధనలో లోతుపాతుల్ని సూచిస్తారని వివరించారు.

వెలుగులోకి ప్రచురితం కాని పరిశోధనలు

స్థానిక నైజర్ ఆతిథ్యంతో జరుగుతున్న 11వ అంతర్జాతీయ సింపోజియం (ఐఎస్‌పీపీ) ఎన్నో ప్రచురితం కాని తాజా పరిశోధనల్ని ఈ వేదికపై బహిరంగపరచనుంది. మొక్కల ఫొటో బయాలజి రంగంలో విజ్ఞానవేత్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి ప్రతిభావంతులు తమ ప్రచురించని ఫలితాలను పంచుకోవడానికి ఆసక్తితో ఈ సదస్సుకు హాజరు అవుతున్నారు. వీరి మధ్య చర్చ, ఇష్టాగోష్ఠి, పరిశోధనల లోతుపాతులు, అమూల్యమైన పరిశోధనలపై సామాన్య సమాజానికి అవగాహన కల్పించే లక్ష్యంతో భవిష్యత్తు దిశలను చర్చించడానికి ఈ వేదికపై ఉమ్మడిగా సమావేశం అవుతున్నారు. మొక్కల ఫొటో బయాలజి రంగంలో తాజా సాంకేతికత, విధానాలను వాస్తవ కార్యాచరణకు సహాయ పడుతుంది. మొక్కల ఫొటో బయాలజీలో ప్రస్తుత పోకడలపై ఎంబో వర్క్‌షాప్ ఉత్తర, దక్షిణ అమెరికా, ఆసియా, యూరప్ నుంచి పరిశోధకులను ఒకచోటకు చేర్చడం విశేషం. సదస్సులో 40 ఆహ్వాన చర్చలు, 8 లఘు చర్చలు, 15 ఫ్లాష్ చర్చలు, 2 పోస్టర్ సెషన్ కార్యక్రమాల్లో 52 మంది ప్రముఖ వక్తలు పాల్గొంటారు.

వర్కుషాపుతో ప్రారంభం

నైజర్ పఠాణి సామంత ఆడిటోరియం ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఐఎస్‌పీపీ ఎంబో వర్కుషాపు ప్రారంభం అవుతుంది. స్విట్జర్లాండ్ లౌసానే విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ క్రిస్టియన్ ఫ్యాంకజర్ ముఖ్య అతిథిగా ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో జర్మనీ యూనివర్సిటీ ఆఫ్ కలోన్ ప్రొఫెసర్లు కరేన్ హాలిడే, యుటే హోకర్ విశిష్ట అతిథిగా హాజరవుతున్నారు. సదస్సు నిర్వాహక సంస్థ నైజర్ ప్రొఫెసర్ కిషోర్ పాణిగ్రాహి కన్వీనర్‌గా, ప్రొఫెసర్లు చందన గోస్వామి, డాక్టర్ సౌరవ్ దత్త సంయుక్త కన్వీనర్లుగా ఐఎస్‌పీపీ అంతర్జాతీయ సదస్సుకు సారథ్యం వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఎలుగుబంట్ల స్వైర విహారం



రోడ్లపై సంచరిస్తున్న ఎలుగుబంట్లు

జయపురం: స్థానిక అటవీ ప్రాంతంలో నాలుగు పెద్ద ఎలుగుబంట్లు స్వైరవిహారం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ గ్రామాల వైపు వస్తున్నాయి. అడవిలో ఆహారం కొరత వలన అవి గ్రామాల బాట పడుతూ పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు వాటిని బంధించి అడవుల్లో విడిచిపెట్టాలని కోరుతున్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న తయారీ సామగ్రి

రాయగడ: నదీతీర ప్రాంతాల్లో అక్రమంగా చేపడుతున్న నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. కలహండి సరిహద్దు ప్రాంతాలైన రామగిరిలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 1,500 లీటర్ల బెల్లంఊట, 150 లీటర్ల నాటు సారాను అధికారులు ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి వినియోగించే వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా అక్రమంగా తయారు చేసి పొరుగు జిల్లాకు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు టికిరి పోలీసుస్టేషన్ ఐఐసీ సూర్య ప్రకాష్ నాయక్ తెలియజేశారు.

ద్విచక్ర వాహనానికి మంటలు



మంటల్లో దగ్ధమవుతున్న బైకు

రాయగడ: జిల్లాలోని మునిగుడలో ఉన్నటువంటి గ్యారేజీ వద్ద ఒక ద్విచక్ర వాహనంలో సోమవారం మంటలు చెలరేగాయి. గ్యారేజీలో బైకు రిపేరు అనంతరం ట్రైల్ వేసేందుకు వెళ్తుండగా ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది అదుపు చేశారు. మునిగుడలోని సురేష్ కుమార్ అనే వ్యక్తికి సంబంధించిన బైకుగా గుర్తించారు.

బియ్యం లోడ్‌తో లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా నుంచి గంజాం జిల్లా సరిహద్దు తప్తపాణీ ఘాట్ రోడ్డు మీదుగా బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. బల్లిగుడా ఎస్డీపీవో మనోజ్ కుమార్ పూజరి తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఘాట్ రోడ్డుపై నుంచి బరంపురం వైపు వస్తున్న ట్రక్ బోల్తాపడింది. ఘటనలో ఖుర్దా జిల్లా జట్నీకి చెందిన డ్రైవర్ లోక్‌నాథ్ సాహు అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఒడ్రాఫ్ బృందం సాయంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, క్లీనర్‌ను రక్షించి బంజనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జేసీబీ సాయంతో ట్రక్‌ను వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడిన బైక్ చోరీ నిందితుడు



అరెస్టైన సుజనా నాయిక్

జయపురం: ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగలించిన నిందితుడు పోలీసులకు ఆదివారం పట్టుబడ్డాడు. జయపురం పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో సోమవారం ఈ విషయం వెల్లడించారు. గత నెల 12వ తేదీన పట్టణంలోని టంకర గ్రామంలో గొరా మరియు బైక్ అప్సరా హోటర్ ప్రాంతంలో దొంగతనానికి గురైంది. దీంతో బాధితుడు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటినుంచి దర్యాప్తు ప్రారంభించారు. దీనిలో భాగంగా నిందితుడిని బొయిపరిగుడ సమితి దసమంతపూర్ గ్రామంలో అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు సుజనా నాయిక్‌ను అరెస్టు చేసి అతడు దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. బైక్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో ఇంజిన్, చాసీ నంబర్ల ఆధారంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. దొంగను కోర్టులో హాజరుపరిచి, బైక్ పోగొట్టుకున్న వ్యక్తికి వాహనాన్ని అప్పగించామన్నారు.

పెరుగుతున్న వాయు కాలుష్యం



- ఢిల్లీ కంటే దిగజారుతున్న గాలి నాణ్యత

భువనేశ్వర్: రాష్ట్రంలో వాయు కాలుష్యం పెరుగుతోంది. ఢిల్లీలో కంటే ఈ తీవ్రత అధికమవుతున్నట్లు కాలుష్య నియంత్రణ వర్గాల సమాచారం. ఆదివారం ఢిల్లీలో గాలి నాణ్యత 333 నమోదు కాగా, రాష్ట్రంలోని బాలాసోర్ ప్రాంతంలో 334 నమోదు కావడం కలవరపరుస్తోంది. తాజాగా జారీ అయిన నివేదికల ప్రకారం రాష్ట్రంలో 7 పట్టణ ప్రాంతాల్లో గాలి నాణ్యత గణనీయంగా దిగజారినట్లు స్పష్టమవుతోంది. బాలాసోర్, భువనేశ్వర్, కటక్, బరిపద, కెంజొహర్, రాయ్‌రంగ్‌పూర్, అంగుల్ పట్టణ ప్రాంతాల్లో గాలి నాణ్యత చాలా తక్కువగా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకటించింది. వాతావరణ మార్పులతో పాటు పర్యావరణ సమస్యలు రాష్ట్ర పట్టణ ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణతకు దారితీశాయని పర్యావరణ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విచ్చలవిడిగా నిర్మాణాలు మరియు ఇతర కార్యకలాపాల కారణంగా వాయు కాలుష్యం బలం పుంజుకుని గాలి నాణ్యత క్రమంగా దిగజారుతుందని ఆందోళన చెందుతున్నారు. గాలి నాణ్యత తగ్గితే ప్రజలు మరియు జంతు, పశుపక్షాదుల్లో శ్వాస సమస్యలు మరియు శ్వాసకోశ రుగ్మతలు ఏర్పడతాయని ఈ వర్గం హెచ్చరించింది.

ప్రాంతం	గాలి నాణ్యత (ఏక్యూఐ)
బాలాసోర్	334
కటక్	320
బరిపద	316
కెంజొహర్	314
భువనేశ్వర్	311
రాయిరంగపూర్	308
అంగుల్	300

విదేశీ వర్సిటీలతో ఎంవోయులు







ఎంవోయూలు కుదుర్చుకుంటున్న దృశ్యం

భువనేశ్వర్: బోధన, పరిశోధన రంగాల్లో సహకార అవకాశాలను అన్వేషించే లక్ష్యంతో స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) మూడు విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) సోమవారం కుదుర్చుకుంది. ఈ సంస్థ బల్గేరియాకు చెందిన ప్లోవ్‌డివ్ యూనివర్సిటీ పైసీ హిలెన్‌డార్‌స్కి, బంగ్లాదేశ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం, బంగ్లాదేశ్‌లోని జహంగీర్ నగర్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్, ప్లోవ్‌డివ్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రుమెన్ మ్లాడెనోవ్ రెక్టార్, ప్లోవ్‌డివ్ యూనివర్సిటీ పైసీ హిలెండర్‌స్కీలు ఎంవోయూపై సంతకాలు చేశారు. బంగ్లాదేశ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందాలపై ఐఐటీ భువనేశ్వర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ సాహు, డీన్ (అలుమ్ని అఫైర్స్ మరియు ఇంటర్నేషనల్ రిలేషన్స్), ప్రొఫెసర్ మహ్మద్ జారెజ్ మియా, బంగ్లాదేశ్‌లోని జహంగీర్ నగర్ విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ ఎం.షమీమ్ కైజర్ ప్రాతినిధ్యం వహించి సంతకం చేశారు. వివిధ సంయుక్త పథకాలు, అధ్యాపక మార్పిడి కింద విద్యావేత్తలు మరియు పరిశోధనలలో సహకార సంబంధాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఐఐటీ భువనేశ్వర్ మరియు విదేశీ విశ్వవిద్యాలయాల మధ్య ఈ మూడు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్ తెలిపారు. యూకే, బల్గేరియా, బంగ్లాదేశ్, లాత్వియా, బెల్జియం, టర్కీ మరియు భారతదేశం నుంచి వివిధ విశ్వవిద్యాలయాలు మరియు సంస్థల నుండి దాదాపు 40 మంది ప్రతినిధులు ఈ సంస్థను సందర్శించిన సందర్భంగా ఐఐటీ భువనేశ్వర్ డీన్లు, అధ్యాపకుల సమక్షంలో అవగాహన ఒప్పందాలు జరిగాయి.

బీజేడీకి షాక్

- మాజీ ఎమ్మెల్యే బలభద్ర మాఝీ రాజీనామా



భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేడీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బలభద్ర మాఝీ సోమవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను బీజేడీ అధ్యక్షుడు, సీఎం నవీన్ పట్నాయక్‌కు పంపారు. 1997లో పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎక్కువ కాలం పని చేసేందుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బలభద్ర మాఝీ 2014 నుంచి 2019 వరకు కలహండి జిల్లా లంజిగఢ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగారు. పార్టీ అతనికి 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించింది. ఆయన బదులుగా ప్రదీప్ దిషారీని రంగంలోకి దించింది. అధికార బీజేడీ నుంచి వైదొలగడానికి మాజీ ఎమ్మెల్యే ఎటువంటి కారణాన్ని వేలెత్తి చూపకున్నా, గత కొద్దికాలంగా పార్టీలో నిర్లక్ష్యానికి గురవుతుండడంతో మనస్తాపం చెందినట్లు తెలుస్తోంది. పార్టీలో తనను పక్కనపెట్టారని పలుమార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో బలభద్ర మాఝీ బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి వైదొలగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బలభద్ర మాఝీ తదుపరి ఏం నిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సమ్మె విరమణ



ఆందోళనకారుల ప్రతినిధుల సమావేశ బృందం

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు నడుం బిగించిన మోటారు కార్మికులు వెనుకకు తగ్గారు. వీరంతా సమ్మె విరమించుకున్నట్లు సోమవారం ప్రకటించారు. రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ అధికారులు, ఒడిశా మోటారు రవాణా కార్మికుల సమాఖ్య ప్రతినిధుల మధ్య లోక్‌సేవా భవన్‌లో జరిగిన సుహృద్భావ చర్చ ఫలప్రదం కావడంతో ఈ ప్రకటన జారీ చేయడం విశేషం. హిట్ అండ్ రన్ కేసుల్లో డ్రైవర్లకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధిస్తూ భారతీయ న్యాయ సంహితలో చేసిన కొత్త నిబంధనకు నిరసనగా ఒడిశా మోటారు రవాణా కార్మికుల సమాఖ్య నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన వాణిజ్య, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి భువనేశ్వర్, కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి, భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్ హాజరై ఇటీవల చేసిన ప్రకటన ఆధారంగా సమ్మె విరమించాలని ఫెడరేషన్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోం కార్యదర్శి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమ్మె విరమించాలని ఫెడరేషన్‌ను కోరారు. ఫెడరేషన్ తరపున ఆల్–ఒడిశా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ పతి, ఉల్లాష్ స్వైన్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న కమలా పూజారి

భువనేశ్వర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత కమలా పూజారి కోలుకున్నారు. ఈనెల 5వ తేదీన ఆమె ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చేరారు. కొరాపుట్ జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి ఇక్కడికి తరలించడంతో న్యూ మెడిసిన్ వార్డులో చేర్చి చికిత్స ప్రారంభించారు. ప్రత్యేక వైద్య నిపుణుల బృందం విజయవంతమైన చికిత్సతో ఆమె కోలుకోవడంతో సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. మెడిసిన్, నెఫ్రాలజీ, ఇతర విభాగాల నిపుణుల బృందం చికిత్స నిర్వహించింది. ఆమె ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. అవసరమైతే ఈ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని ఆమెకు సూచించినట్లు మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ జయంత్ పండా తెలిపారు. ఆమె కిడ్నీ సంబంధిత వ్యాధి, రక్తహీనత, ఇతర అనేక వ్యాధులతో బాధపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక అంబులెన్స్‌లో కమలా పూజారిని ఆమె స్వస్థలం కొరాపుట్ తరలించారు.

మహిళ మెడలో గొలుసు దొంగతనం

రాయగడ:

ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు మహిళ మెడలో గొలుసు దొంగతన చేసిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరణం వీధిలో నివసిస్తున్న వారణాసి చంద్రకళ (50), ఆమె కొడుకు జస్వంత్ (16)లు పండగ షాపింగ్ చేసేందుకు ఆదివారం సాయంత్రం మార్కెట్‌కు వెళ్లారు. పనులు ముగించుకొని మెయిన్ రోడ్డు మీదుగా ట్రెజరీ కార్యాలయం వైపు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో బంగారు చైన్‌ను తెంచుకొని పారిపోయారు. దీనిపై వెంటనే పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా హెల్మెట్లు ధరించిన ఇద్దరు వ్యక్తులు నీలం రంగు గల ద్విచక్ర వాహనంపై వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



సీసీ కెమెరాలో నమోదైన నిందితుల దృశ్యాలు



బాధితురాలు చంద్రకళ

గంజాయి పంట ధ్వంసం



గంజాయి పంట దగ్ధం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఖరంపురం: అవిభక్త గజపతి–గంజాం జిల్లాల సరిహద్దు దిగపండి బ్లాక్ పరిధి పట్టపూర్ పోలీసుస్టేషన్ దగ్గర అటవీ ప్రాంతాల్లో అక్రమంగా సాగు చేస్తున్న 1000 ఎకరాల్లో గంజాయి తోటలను ఎక్సైజ్ అధికారుల సాయంతో పోలీసులు ధ్వంసం చేశారు. ఎవరైనా అక్రమంగా సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కొందమాల్ పోలీసులు బ్రహ్మణిగాం పోలీసు స్టేషన్ పరిధి కామన్‌కుల అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. అదేవిధంగా కె.నువాగాం పోలీసుస్టేషన్ పరిధి చికిటి పెంట శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై సైతం దాడులు చేసి మొత్తం 3,600 లీటర్ల నాటుసార ధ్వంసం చేశారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి వారివద్ద నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ గుప్తేశ్వర్ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు ఎప్పటిలాగే రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని తనిఖీ చేయగా 60 కిలోల గంజాయి పట్టుబడింది. రాయగడ నుంచి మధ్యప్రదేశ్‌కు అక్రమంగా ఈ గంజాయిని రవాణా చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అరెస్టైనవారు గంజాం జిల్లా అడవ ప్రాంతానికి చెందిన సమీర్ రైతా, సంజీవ్ రైతాలుగా అధికారులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

క్లుప్తంగా

గజేంద్రుడు మృతి



దర్యాప్తు చేపడుతున్న అటవీ అధికారులు

బరంపురం: గంజాం జిల్లా ఉత్తర గుముసర తారసింగ్ అటవీ ప్రాంతం బనపూర్ గ్రామంలో కూరగాయల వ్యవసాయ భూమిలో మగ ఏనుగు సోమవారం మృతి చెందింది. దీంతో స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందజేశారు. గుముసరా డివిజన్ తారసింగ్ అటవీ రేంజర్ కృష్ణదాస్, ఏసీఎఫ్ విక్రమ్ దేవ్ పట్నాయక్‌లు బృందంతో ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి చేరుకొని కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పశు వైద్యుల సాయంతో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే పాతిపెట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

మల్కన్‌గిరి ఎయిర్ పోర్టు ప్రారంభం నేడు



భద్రతా ఏర్పాట్లలో సిబ్బంది

మల్కన్‌గిరి: ఎన్నో ఏళ్లనాటి జిల్లా ప్రజల కల మంగళవారం తీరనుంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా మల్కన్‌గిరిలో నూతనంగా నిర్మించిన ఎయిర్ పోర్టు ప్రారంభమవ్వనుంది. ఈ మేరకు ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఇక్కడ 1,620 మీటర్ల రన్ వే ఉంది. కావున ప్రస్తుతం మీడియం క్లాస్ విమానాలు మాత్రమే ల్యాండ్ అవుతాయి. 14 నెలల వ్యవధిలో రూ.54 కోట్లు ఖర్చుతో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. సీఎం పర్యటనలో 5వేల మంది పాల్గొనే అవకాశం ఉందని కలెక్టర్ విశాల్ సింగ్ వెల్లడించారు.

బోధన సిబ్బంది నియామకానికి 11న డెమో

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభించిన నాలుగేళ్ల సమీకృత డిగ్రీ కోర్సులో బోధన సిబ్బంది నియామకానికి ఈ నెల 11న డెమో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య చెప్పారు. వర్సిటీలో సోమవారం మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి పాలక మండల సమావేశ మందిరంలో ఈ డెమో నిపుణుల పర్యవేక్షణలో ఉంటుందని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యిందని, డెమోకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, రెండు సెట్ల జిరాక్సులతో హాజరు కావాలని సూచించారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.3.98 లక్షలు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.3,98,599 ఆదాయం లభించిందని ఆలయ ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావులు తెలిపారు. 55 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీని సోమవారం తెరిచి లెక్కించామని, శ్రీకాకుళం సహాయ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షకులు జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షించారని తెలిపారు.

'యాక్ట్ రద్దు చేసే వరకు పోరాడుతాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్–23 రద్దు చేసే వరకు పోరాడుతామని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు అన్నారు. శ్రీకాకుళం బార్ అసోసియేషన్ భవనంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయవాదుల సంక్షేమ నిధి రూ.20 విలువ కలిగిన స్టాంపు డ్యూటీ రుసుంను రద్దు చేయాలని కౌన్సిల్‌కు సిఫార్సు చేశామన్నారు. అలాగే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టం–23 అంశంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రిట్ పిటీషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యాయని, అవి ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేసిన తరువాత విచారణ జరుగుతుందని చెప్పారు. అంతవరకు లాయర్లు విధులకు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సదాశివుని వెంకటేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. టెక్కలి ఎస్ఐ-2 రమేష్ బాబు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన వెంకటేష్ పలాస నుంచి ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తుండగా స్థానిక నాలుగురోడ్లు జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చిన డంపర్(లారీ) ఢీకొనడంతో గాయాలయ్యాయి. అతడిని స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దత్తక్షేత్రంలో స్వామీజీ పూజలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని చిం దత్తనాథ క్షేత్రానికి విచ్చేసిన మైసూర్‌కు చెందిన దత్తపీఠం బాలస్వామి విజయానంద తీర్థ స్వామిజీ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనఘా సమేత దత్తాత్రేయ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అలాగే మృత్యుంజయ హోమం నిర్వహించారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన



చార్లీచాప్లిన్ డ్యాన్స్ అభినయిస్తున్న చిన్నారులు



ఆకట్టుకుంటున్న చిన్నారుల నృత్యం

సందడే.. సందడి

పర్లాకిమిడి సెయింట్ జోసెఫ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు సోమవారం సందడిగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. మరో గౌరవ అతిథిగా రెవరెండ్ ప్రశాంత్ కుమార్ దిగాల్ (బరంపురం) విచ్చేయగా, సెయింట్ జోసెఫ్ స్కూల్ మేనేజర్ డాక్టర్ శరత్ చంద్ర నాయక్ స్కూల్ విజయాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. – పర్లాకిమిడి



షెర్లాక్ హోమ్స్ రూపకంలో ఒక సన్నివేశం



ఒడిస్సీ నృత్య ప్రదర్శన



యాంకరింగ్ చేస్తున్న చిన్నారులు

చంద్రపూర్‌లో ఫోరెన్సిక్ బృందం పర్యటన



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో సెంట్రల్ ఫోరెన్సిక్ బృందం సోమవారం పర్యటించింది. ఇద్దరితో కూడిన బృందంతో జిల్లా అదనపు ఎస్పీ విష్ణుచరణ్ పాత్రో కూడా పాల్గొని సహకరించారు. గతేడాది డిసెంబర్ 21వ తేదీన కాసీపూర్ సమితి లికిటిగుడ గ్రామానికి చెందిన లక్ష్మీ మాఝి అనే ఆదివాసీ మహిళ చంద్రపూర్‌లోని ఆస్పత్రి వెనుక హత్యకు గురైన సంఘటన తెలిసిందే. అలీసా అనే సంస్థ నిర్వహిస్తున్న మా గృహంలో మేనేజర్‌గా పనిచేసే మాఝి హత్యకు గురై 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకు సంబంధిత నిందితులను పట్టుకోవడంలో పోలీసు యంత్రాంగం విఫలం చెందిందని రాజకీయ పార్టీలతో పాటు ఆదివాసీ మహాసంఘం తీవ్రంగా ఖండించాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం క్రైమ్ బ్రాంచ్‌తో దర్యాప్తు చేపట్టించింది. అయితే క్రైమ్ బ్రాంచ్‌పై తమకు ఎటువంటి నమ్మకం లేదన్న ఆదివాసీ మహాసంఘం సీబీఐతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఇదిలాఉండగా లక్ష్మీ మాఝి హత్యకు గల కారణాలను కనుగొనేందుకు సెంట్రల్‌కు చెందిన ఇద్దరితో కూడిన ఫోరెన్సిక్ బృందం చంద్రపూర్‌లో పర్యటించింది. లక్ష్మీమాఝి హత్యకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన బృందం అనంతరం ఆస్పత్రిలో, మా గృహంలో పర్యటించి వివరాలను తెలుసుకున్నారు.

వినియోగదారులకు చెక్కులు అందజేత



చెక్కులు అందుకుంటున్న వినియోగదారులు

రాయగడ: గ్యారంటీ పిరియడ్‌కు ముందే పాడైపోయిన కెమెరాల స్థానంలో కొత్త కెమెరాలను లేదా డబ్బులను కంపెనీ చెల్లించాలని వినియోగదారుల ఫోరం ఇచ్చిన తీర్పు మేరకు చెక్కులను వినియోగదారులకు సోమవారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. రాయగడకు చెందిన జర్నలిస్ట్ సురేష్ దాస్, మునిగుడకు చెందిన మరో జర్నలిస్ట్ సింహాచల్ పండాలు తమ వృత్తికి సంబంధించి వేర్వేరుగా రెండు డిజిటల్ వీడియో కెమెరాలను భువనేశ్వర్‌లో కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఇద్దరి కెమెరాలు సైతం గ్యారెంటీ సమయానికి ముందే పాడైపోవడంతో ఆ కంపెనీకి తిరిగి అందజేశారు. అయితే మూడు నెలల వ్యవధి తర్వాత కెమెరాలు రిపేర్ చేయడం కుదరని సదరు కంపెనీ తిరిగి కెమెరాలను వినియోగదారులకు పంపించింది. దీంతో గత్యంతరం లేక వినియోగదారులు 2019 డిసెంబర్ 16వ తేదీన జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన ఫోరం అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పండ 2023 అక్టోబర్ 26వ తేదీన పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చారు. కొత్త కెమెరాలను పిటీషన్‌దారులకు ఇవ్వాలని, లేని పక్షంలో వాటి కొనుగోలు ధరను తిరిగి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. దీంతో కంపెనీ తరుపున శుభేందు కుమార్ అనే వ్యక్తి వినియోగదారులైన సురేష్‌కుమార్ దాస్, సింహాచల్ పండాలకు కెమెరా ధరలకు సంబంధించిన చెక్కులను ఫోరం అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పండ సమక్షంలో అందించారు.

మిల్లర్లకు వ్యతిరేకంగా ఆందోళన



రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా దోంద్రా గ్రామంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత వారం రోజులుగా ధాన్యం మండీల్లో ఉన్నప్పటికీ విక్రయాలు జరగడంలేదని రైతులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. వాసన వస్తున్న ధాన్యం పేరుతో క్వింటాల్‌కి 10 నుంచి 13 కేజీల కోత వేస్తున్నారన్నారు. రైతులకు మద్దతుగా బీజేపీ నాయకుడు గౌరీశంకర్ మజ్జి కార్యకర్తలతో అక్కడకి చేరుకున్నారు. అనంతరం ధాన్యం బస్తాలను రోడ్డు మీద వేసి రాస్తారోకోకి దిగారు. దీంతో తెంతులకుంటి మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి.

'రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి'

భువనేశ్వర్:

స్థానిక హైటెక్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో పేలుడులో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ విద్యార్థి విభాగం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆరోగ్య మంత్రి నిరంజన్ పూజారి అధికారిక క్వార్టర్స్ ఎదుట ఆందోళనకు దిగారు. హైటెక్ ఆస్పత్రి చైర్మన్ తిరుపతి పాణిగ్రాహిని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే రానున్న రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆరోగ్య మంత్రి అధికారిక నివాసం వద్ద కోడిగుడ్లు రువ్వడంతో ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలను చెదరగొట్టే ప్రయత్నంలో తోపులాట చోటు చేసుకుంది. అయితే ఆస్పత్రి న్యాయపరంగా, నైతికంగా సరైన చర్యలు తీసుకుందని, ఎలాంటి విచారణనైనా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తిరుపతి పాణిగ్రాహి తెలిపారు.





తిరుపతి పాణిగ్రాహి చిత్రపటం దహనం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ ఆందోళనకారులు, ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

రూ.6.81 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలో రూ.6.81 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆమోదం తెలిపారు. మొత్తం 33 పనులకు రూపొందించిన అంచ నాలను ఆమోదించారు. అరసవల్లిలో రాష్ట్ర ప్రభుత్వం నగర పాలకసంస్థకు కేటాయించిన 2.7 ఎకరాల స్థలానికి రూ. 40 లక్షలతో ప్రహరీ, రూ. 11.7 లక్షలతో పీఎన్ కాలనీ, చౌదరి సత్యనారాయణ కాలనీని అనుసంధా నం చేస్తూ కల్వర్టు నిర్మాణానికి నిర్ణయించారు. అలాగే చౌదరి సత్యనారాయణ కాలనీలోని సోడా వారి కాలనీలో రూ.10.6 లక్షలతో గ్రావెల్ వేసేందుకు ఆమోదం తెలిపారు. ఏపీ హెచ్‌బీ కాలనీలో రూ. 10.6 లక్షలు, కిల్లిపాలేం పరిధిలోని శ్రీనివాస నగర్‌లో రూ.10.7 లక్షలు, ఖాజీపేట పరిధిలోని అరసవల్లి సమీపంలో 13.75 లక్షలతోనూ, దండివీధి సమీపంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో రూ.15.1 లక్షలతోనూ, హయాతీనగరంలోని సెగిడివీధిలో రూ.15.3 లక్షలతోనూ, కిల్లిపాలేం కాలనీలోని రూ. 17.2 లక్షలతో కాలువలను నిర్మించనున్నారు. అలాగే రెడ్డి కిల్లిపాలేంలోని ఎస్సీ వీధిలో రూ.19 లక్షలు, అదే ప్రాంతంలో రూ. 20.25 లక్షలు, బలగ ఏఎస్ఎన్ కాలనీలోని రూ. 22 లక్షలు, తిలక్‌నగర్‌లో రూ. 28.7 లక్షలు, చౌదరి సత్యనారాయణ కాలనీ శివారులో రూ. 31 లక్షలు, సత్యసాయినగర్‌లో రూ. 39.8 లక్షలు, ఇందిరానగర్ కాలనీలోని మిర్తిబట్టి సమీపంలో రూ. 32.2లక్షలు, సాయినివాస్ ప్రాంతంలో రూ. 21.2 లక్షలు, డీసీసీబీ కాలనీలో రూ. 18.4 లక్షలతో కాలువలు నిర్మించేందుకు అంచనాలు రూపొందించి ఆమోదించారు. అలాగే బాదుర్లపేట రూ. 21.8 లక్షలు, ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ రూ. 14 లక్షలు, పాత్రునివలసలో సమీపంలో రూ. 40 లక్షలు, అదేప్రాంతంలో రూ. 30.2 లక్షలు, బాదుర్లపేటలో రూ.26.25 లక్షలు, హయాతీనగరంలోనూ రూ.21.9 లక్షలతోనూ సీసీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. బలగలో రూ. 20 లక్షలు, కంపోస్టు కాలనీలో రూ.15.8 లక్షలు, చౌదరి సత్యనారాయణ కాలనీలో రూ.15 లక్షలు, రెడ్డికిల్లిపాలేంలో రూ.12.1 లక్షలతో, గుజరాతీపేటలో రూ.13.0 లక్షలతోనూ సీసీ రోడ్లు నిర్మించేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ పనులకు టెండర్లు వేసి మార్చి మాసాంతం నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు.

ఆ స్థూపం.. జ్ఞాపకాల రూపం


పసుపు రంగు కంచుకోటను వైఎస్ జగన్ అనే ఒకే ఒక్కడు పునాదులతో సహా పెకలించిన జ్ఞాపకాలకు ఆ స్థూపం సజీవ సాక్ష్యం. రాజకీయ ఉద్ధండుల అంచనాలను పటాపంచలు చేస్తూ వైఎస్సార్ కుమారుడు రాసిన నవ చరితకు ఆ కట్టడమే తొలి అక్షరం. విలువలు వదిలేసిన నాటి పాలకులు కలలో కూడా భయపడేలా ప్రజాక్షేత్రంలో ఆయన చేసిన యుద్ధానికి ఆ నిర్మాణం ఓ నిదర్శనం. తన పద ఘట్టనలతో పల్లెపల్లెనూ చైతన్య పరుస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన యాగానికి ఐదేళ్లు పూర్తయ్యాయి. అధికారంలోకి వచ్చాక ప్రజాక్షేత్రంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్న ఆయన జనం మనసులు గెలుచుకున్నారు.

- ప్రజా సంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు పూర్తి
- నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్న విజయ స్థూపం
- పాదయాత్రతో చరిత్ర సృష్టించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఇచ్చిన హామీల్లో 98.8 శాతం అమలు

ఇచ్ఛాపురం రూరల్: రాజన్న బిడ్డగా, ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు పూర్తయ్యాయి. 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర ఆయన సాగించిన పాదయాత్ర ఇచ్ఛాపురంలోనే ముగిసింది. 2017 నవంబర్ 6వ తేదీన ఇడుపులపాయ నుంచి ఆయన పాదయాత్ర ప్రారంభించారు. అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుంటూ, ప్రజలకు భరోసా ఇస్తూ 2017, 2018, 2019 సంవత్సరాల్లో పాదయాత్రను కొనసాగించారు. తెలుగుదేశం పార్టీ అడుగడుగునా ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెరవకుండా ఎత్తుకున్న పనిని సమర్థంగా నిర్వర్తించారు. 13 జిల్లాలు, 134 నియోజకవర్గాలు, 231 మండలాలు, 54 మున్సిపాలిటీలు, 13 జిల్లాలు, 8 కార్పొరేషన్లు, 2,516 గ్రామాల గుండా 3,648 కిలోమీటర్ల మేర సాగిన ప్రజా సంకల్పయాత్ర 2019 జనవరి 9న ఇచ్ఛాపురంలో ముగిసింది. ఈ పాదయాత్ర తర్వాత 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్ సభ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. 2019 మే 30న రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు సంక్షేమం అనే పదానికి పర్యాయపదంగా మారిపోయారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేశారు. పాదయాత్రకు గుర్తుగా లొద్దపుట్టిలో నిర్మించిన విజయ స్థూపం ఆ నాటి కథలను అందరికీ గుర్తు చేస్తోంది.

సమర్థ పాలకుడిగా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన కొత్త వ్యవస్థల దెబ్బకు దళారీలు మాయమయ్యారు. 'కులం చూడం, మతం చూడం, పార్టీలు అసలే చూడం...పేదరికం ఒక్కటే అర్హతకు ప్రామాణికం' అన్నదే నేటి ప్రభుత్వం అజెండా. విద్య, వైద్యం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి ఎన్నో సంస్కరణలు అమలవుతున్నాయి. సాంఘిక భద్రతలో భాగంగా ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించే క్రమంలో పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ఆర్థిక సాయం, ఆరోగ్య సంరక్షణ ద్వారా పేదలకు సాయం అందిస్తున్నారు.



ప్రజా సంకల్పయాత్రకు గుర్తుగా లొద్దపుట్టి వద్ద విజయ స్థూపం

చరిత్రలో నిలిచిపోయేలా



నేనున్నానంటూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో పేదలకు భరోసా ఇచ్చారు. మడమ తిప్పను, మాట తప్పను అంటూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజే గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ప్రకటించి సంచలన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. చరిత్ర నిలిచి పోయేలా ప్రజా రంజక పాలన సాగిస్తున్న జగనన్న మరో 30 ఏళ్లు సీఎంగా ఉండటం గ్యారెంటీ.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్, శ్రీకాకుళం

సామాజిక న్యాయం కోసం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నదే సీఎం జగనన్న నమ్మిన సిద్ధాంతం. తాను నమ్మిన సిద్ధాంతాన్ని మాటల్లో చెప్పకుండా చేతల్లో చేసి చూపిస్తున్నారు. ఆయనతో కలసి ప్రజాసంకల్పయాత్రలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికలకు విజయాలు.

– పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం సమన్వయకర్త

సంక్షేమానికి పెద్దపీట



వెనుకబడిన ఉత్తరాంధ్ర తలరాతను మార్చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వలస ప్రాంతంగా పిలిచే నోటితో ఉపాధి కల్పించే స్థాయికి తీసుకువచ్చారు. కిడ్నీ ఆస్పత్రితో పాటు ఇంటింటికి తాగునీరు, పోర్టులు నిర్మాణాలు చేపట్టి దేవుడయ్యారు. ప్రతి కుటుంబానికి మేలు కలిగించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. విజయ స్థూపం సాక్షిగా మళ్లీ ఆంధ్ర ప్రదేశ్‌కు ముఖ్యమంత్రి జగనన్నే.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ, శ్రీకాకుళం

క్లుప్తంగా

నేటి నుంచి ఎంపీడీఓలకు శిక్షణ

విజయనగరం రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఎంపీడీఓలు, పంచాయతీ విస్తరణాధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ కార్యాలయం ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 10 వరకు జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

కోస్టల్ జోనల్ సెక్రటరీగా రాజాబాబు

విజయనగరం ఫూల్‌బాగ్: ఫారెస్టు రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరిగాయి. ఈ ఎన్నికల్లో విజయనగరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (టాస్క్‌ఫోర్స్)గా పనిచేస్తున్న రాళ్లపల్లి రాజాబాబు కోస్టల్ జోనల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఆయనకు అటవీశాఖ జిల్లా అధికారి ఎస్. వెంకటేష్, ఫారెస్టురేంజ్ ఆఫీసర్ బొత్స అప్పలరాజు, డీఆర్వో ప్రహ్లాదరావు, ఎఫ్ఎస్ఓ కేవీఎస్‌రాజు, అటవీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం గ్రామానికి చెందిన పప్పల ఆదినారాయణ రెండు కిడ్నీలు పాడవడంతో ఆరోగ్యం క్షీణించింది. ఆరోగ్యం నిమిత్తం గుంటూరు జిల్లాలో ఉన్న కుమారుడి వద్దకు చేరుకుని అక్కడి ఆస్పత్రిలో చేరి మూడు నెలలుగా వైద్యసేవలు పొందుతున్నాడు. ఆ గ్రామానికి చెందిన వలంటీర్ పప్పల తిరుపతమ్మ గుంటూరు జిల్లాలోని చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో ఉన్న డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు తన భర్త గురునాయుడును తోడు తీసుకుని వెళ్లి పింఛన్ లబ్ధిదారు ఆదినారాయణకు రూ.10వేలు వైఎస్సార్ పింఛన్ కానుకను సోమవారం అందజేసింది. దీంతో లబ్ధిదారు ఆదినారాయణతో పాటు బంధువులు సంతృప్తి వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు.

రైస్ మిల్లు వద్ద రైతుల ఆందోళన


రామ లక్ష్మణ మిల్లు వద్ద ఆందోళన చేపడుతున్న రైతులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కేఎల్.పురం రామలక్ష్మణ రైస్ మిల్లు వద్ద గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన రైతులు సిరపురపు సన్యాసయ్య, దేముడు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం బస్తాకు 80 కేజీలు తీసుకోవాల్సి ఉండగా 84 కేజీలు తీసుకున్నారని ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. 80 కేజీలు కదా బస్తాకు తీసుకోవాలని అడిగితే మేము ఇంతే తీసుకుంటాం దిక్కున్న చోట చెప్పుకో అంటూ సమాధానం చెప్పారని రైతులు వాపోయారు. 84 కేజీలు చొప్పున ఇస్తేనే ధాన్యం తీసుకుంటామని చెప్పడంతో చేసేది లేక ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు. సీఎస్‌డీటీకి చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు.

చిట్టంపాడు పక్కా రోడ్డుకు రూ.10.4 కోట్లు

- పీఎం జన్‌మన్‌లో నిర్మాణానికి ప్రతిపాదనలు
- పంచాయతీ రాజ్ ఎస్ఈ రమేష్ గుప్తా

విజయనగరం రూరల్: శృంగవరపుకోట మండలంలోని గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా పక్కా రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా ప్రతిపాదనలు రూపొందించామని ఆశాఖ ఎస్ఈ జీఎస్ఆర్ గుప్తా సోమవారం తెలిపారు. విశాఖ-అనంతగిరి-అరకు రోడ్డు నుంచి శెనగపాడు, చిట్టంపాడు మీదుగా ప్రధాన గ్రామమైన గూనపాడు వరకు 10.2 కిలోమీటర్ల రోడ్డును 10.4 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదానికి సమర్పించనున్నట్లు చెప్పారు. ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఉద్దేశించిన పీఎం జన్‌మన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

భామిని: మండలంలోని పెద్ద దిమిలికి చెందిన పాలక రామారావు (47) ఇటీవల ఘనసర-సతివాడ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆది వారం రాత్రి మరణించాడు. మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. రామారావు పాస్టర్ కావడంతో పెద్ద ఎత్తున స్థానికులు, సర్పంచ్ గురాన శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన గృహానికి చేరుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతునికి భార్య రూప, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తె సృజన వలంటీర్‌గా పనిచేస్తోంది.

నూర్పిడి చేసిన వెంటనే...

- జోరుగా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు జిల్లాలో 2.50 లక్షల టన్నులు కొనుగోలు
- 493 ఆర్‌బీకేల ద్వారా 61,788 మంది రైతుల నుంచి మిల్లులకు తరలింపు
- ప్రతీ మిల్లు వద్ద కస్టోడియన్‌ల సేవలు
- 80,260 కూపన్ల ద్వారా ధాన్యం సేకరణ


ధాన్యం బస్తాల నుంచి శాంపిల్స్ తీస్తున్న సిబ్బంది, రైతులు

బొబ్బిలి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నూర్పిడి చేసిన వెంటనే రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతుల నుంచి ధాన్యం సేకరించి మిల్లులకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 493 ఆర్‌బీకేల పరిధిలో ఇప్పటివరకు 2.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ధాన్యానికి సంబంధించిన డబ్బులు గత నెల 24 వరకూ జమయ్యాయి. మిగిలిన వారికి ఈ వారంలోనే చెల్లింపులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవంగా ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపు రైతుల ఖాతాలకు డబ్బులు జమచేయాలి. కానీ ప్రభుత్వ ఆదేశాల మేరకు విక్రయించిన రెండువారాల్లోపలే ధాన్యం బిల్లులను చెల్లిస్తున్నారు. క్వింటాకు ఏ గ్రేడ్ రకానికి రూ.2,203లు, సాధారణ రకానికి రూ.2,183 చొప్పున రైతులకు మద్దతు ధర అందుతోంది.

నిరంతర పర్యవేక్షణ

రైతుల నుంచి సేకరించిన ధాన్యం సక్రమంగా కొనుగోలు కేంద్రాలకు చేరేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చాం. దీనివల్ల వెంటవెంటనే సమాచారం వస్తోంది. నిత్యం పర్యవేక్షణ చేయడం ద్వారా జిల్లాలోని అన్నిప్రాంతాల్లో కంటే బొబ్బిలి నుంచి ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశాం. త్వరగా కొనుగోలు పూర్తిచేసి రైతులకు వారి ఖాతాల్లో నగదు జమచేస్తున్నాం.

– మజ్జి శ్యామ్‌సుందరరావు, అగ్రికల్చరల్ ఏడీ, బొబ్బిలి

లెక్క పక్కాగా...

జిల్లాలో ఉన్న ఆర్‌బీకేల నుంచి తరలిస్తున్న ధాన్యం లెక్కలు సరిచూసేందుకు ప్రతీ మిల్లు వద్ద ప్రభుత్వ అధికారులను కస్టోడియన్లుగా నియమించారు. దీంతో వచ్చిన ధాన్యం ఎంత ? అన్లోడ్ చేసిన ధాన్యమెంత? ఆలస్యం లేకుండా వెంటనే డౌన్‌లోడ్ చేయించడం, రైతులకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వడంతో కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. రైతులు ఆర్‌బీకేలకు తరలించిన ధాన్యానికి ఆపరే


రైతులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏడీ శ్యామ్‌సుందరరావు

వెంట వెంటనే కూపన్లు జారీ..

టర్లు వెంటనే రైతులకు చెందిన ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్‌లను అప్‌లోడ్‌చేసి కూపన్లు జారీచేస్తున్నారు. దీనివల్ల రైతులకు సకాలంలో నగదు వారి వ్యక్తిగత ఖాతాలకు జమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 80,260 కూపన్లు జారీ చేసి ధాన్యం సేకరించారు.

బొబ్బిలిలో అత్యధికం

జిల్లా వ్యాప్తంగా 2.50లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేపట్టగా, బొబ్బిలి నియోజకవర్గంలోని రైతులు అధికమంది నూర్పిడిచేయడంతో ధాన్యం విక్రయంలో ముందున్నారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లోని 11,383 మంది రైతుల నుంచి 47,963.52 టన్నుల ధాన్యాన్ని సోమవారం నాటికి కొనుగోలు చేశారు. ట్రక్ షీట్ల నమోదు జరుగుతూనే ఉంది.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


భోగాపురం: మిరప వెంకటేష్(ఫైల్)

భోగాపురం: మండల కేంద్రం భోగాపురం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు సోమవారం దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన మిరప వెంకటేష్(20) ఈ మధ్య భవానీ మాల వేసుకుని దీక్ష పూర్తి చేసుకుని విజయవాడ వెళ్లి దుర్గాదేవికి మొక్కులు చెల్లించుకుని తిరిగి గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో అమ్మవారి ప్రసాదాలను బంధువులకు ఇచ్చేందుకు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి వెళ్లాడు. బంధువులకు ప్రసాదాలను ఇచ్చి తిరిగి వస్తుండగా భోగాపురం పెద్ద కానాల వద్దకు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన తుప్పల్లోకి దూసుకుపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి ఆదిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: విజయనగరం, కోరుకొండ రైల్వేస్టేషన్‌ల మధ్య జొన్నవలస గేట్ సమీపంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వ్యక్తిని రైలు ఢీకొందని జీఆర్‌పీ ఎస్సై రవివర్మ సోమవారం తెలిపారు. మృతదేహం నుజ్జునుజ్జయి, గుర్తుపట్టలేనంతగా ఉందన్నారు. మృతుడి వంటిపై గోధుమ రంగు పంచె, నీలం, ఎరుపు, నలుపు రంగులతో కూడిన నిలువు గీతలు కలిగిన షర్ట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు..

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లికి చెందిన వృద్ధుడు చింతల త్రిమూర్తులు(73)సీతానగరం, బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై పట్టాలు దాటే సమయంలో గూడ్స్ రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే ఔట్‌పోస్టు ఇన్‌చార్జి ఎస్.కృష్ణారావు విలేకరులకు తెలిపారు. మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌తో సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది


కొత్తవలస: ముసిరాం గ్రామం సమీపంలో సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న సీఐ చంద్రశేఖర్ తదితరులు

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామం సమీపంలో గల రహస్యప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీలపై సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేసి సారా తయారీకి డ్రమ్ములతో నిల్వ చేసిన సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పోలీసుల రాకను గమనించిన సారా తయారీదారులు అక్కడినుంచి పరారయ్యారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తులను త్వరలోనే గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వీరజనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు లీటర్ల సారాతో పట్టుబడిన మహిళ

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో కొత్తవలస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రాజేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించగా గ్రామానికి చెందిన నెల్లి అప్పలనర్సమ్మ సారా అమ్ముతూ పట్టుబడింది. ఈ మేరకు ఆమె నుంచి మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేశ్వరం తెలిపారు.

20 మద్యం సీసాల సీజ్

గజపతినగరం: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన కర్రోతు సన్యాసిరావు నుంచి 20మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ డీఎస్పీ ఎస్.మహీంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామానికి చెందిన ఎ.నాగరాజును గజపతినగరం మరుపల్లి గ్రామం వద్ద12 మద్యం సీసాలతోను, గజపతినగరం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గేదెల సత్యనారాయణ నుంచి 44మద్యం సీసాలను ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

100 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గరికిపేట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు గ్రామంలోని బెల్టు షాపులో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 100 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి పండగకు 54 ప్రత్యేక రైళ్లు

విజయనగరం టౌన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈస్ట్‌కోస్ట్ రైల్వే 54 ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 2వ తేదీ వరకూ ఈ రైళ్లు యథావిధిగా నిర్ణీత సమయాల్లో తిరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా మీదుగా వెళ్లే ఈ ప్రత్యేక రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కొన్ని ప్రధాన రైళ్ల వివరాలిలా..

రైలు నంబర్ 08537 శ్రీకాకుళం-కొల్లాం,
07089 సికింద్రాబాద్ బరంపురం,
07090 బరంపురం-వికారాబాద్,
08538 కొల్లాం - శ్రీకాకుళం రోడ్డు,
07094 బరంపురం- సికింద్రాబాద్,
07091 వికారాబాద్ -బరంపురం,
08547 శ్రీకాకుళం రోడ్డు, వికారాబాద్,
07025 సికింద్రాబాద్-బరంపురం,
08537 శ్రీకాకుళం రోడ్డు- కొల్లాం,
07026 బరంపురం -సికింద్రాబాద్,
02809 భువనేశ్వర్ -సికింద్రాబాద్,
07027/07028 హైదరాబాద్-బరంపురం-హైదరాబాద్
02810 తిరుపతి-భువనేశ్వర్,
08538 కొల్లాం -శ్రీకాకుళం రోడ్డు,
07093:/07094 సికింద్రాబాద్-బరంపురం,-సికింద్రాబాద్, 09069/09070 సూరత్ - బరంపురం-సూరత్,
08537 శ్రీకాకుళం రోడ్డు-కొల్లాం,
02809/02810 భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్,
09069/09070 సూరత్- బరంపురం- సూరత్‌లతో పాటు మరికొన్ని రైళ్లను ప్రవేశపెట్టారు. రైళ్ల సమయం, బెర్తుల ఖాళీలను ఆన్‌లైన్‌లో చూసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ అధికారులు కోరారు.

100 మద్యం బాటిళ్ల పట్టివేత

నెల్లిమర్ల: మండలంలోని గరికిపేటలో 100 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్మకాలపై అందిన సమాచారం మేరకు సోమవారం దాడులు చేపట్టగా నిందితులు పట్టుబడ్డారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్సై నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. 1వ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ పర్యవేక్షణలో పోలీసులు 16 మంది మున్సిపల్ కార్మికులను అరెస్టు చేశారు. ఈ అరెస్ట్‌లను సీఐటీయూ జిల్లా నాయకులు శంకరరావు, జగన్‌మోహన్‌రావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికుల పోరాటానికి వివిధ సంఘాల నాయకులు టీవీ రమణ, బి. పైడిరాజు, కె.త్రినాథ్ మద్దతు ప్రకటించారు.

జాతీయ తైక్వాండో పోటీల విజేతకు కోలగట్ల అభినందన


విజేతను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో కాంస్య పథకాన్ని సాధించిన హిమశ్రీని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభినందించారు. ఈ మేరకు సోమవారం కోలగట్ల గృహానికి చేరుకున్న కాంస్య పతక విజేత హిమశ్రీ పోటీ వివరాలు, గెలుపొందిన తీరును ఆయనకు వివరించింది. మధ్యప్రదేశ్ లోని బేతల్‌లో డిసెంబర్ 31 నుంచి జనవరి 5 వరకు జరిగిన తైక్వాండో పోటీలలో హిమశ్రీ కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఇటీవల నగరానికి చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో వివిధ పతకాలను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కోచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్ షిప్..

జిల్లా క్రీడాకారుల సొంతం


విజేతలను అభినందిస్తున్న డీఈఓ బి.లింగేశ్వరరావు

విజయనగరం అర్బన్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 16వ నేషనల్ లెవెల్ ఆల్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారులు ఓపెన్ చాంపియన్ షిప్‌ను గెలుచుకున్నారు. ఈ మేరకు భజరంగ్ మార్షల్ ఆర్ట్స్ కోచ్ బుదురై సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలు సోమవారం డీఈఓ బి.లింగేశ్వరరెడ్డిని కలిసి అభినందనలు అందుకున్నారు. స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అండర్-17 విభాగంలో పాండ్రంకి పావని, నోడగాళ్ల వినయ్‌కుమార్‌లకు గోల్డ్ మెడల్స్, అండర్-14 విభాగంలో మైలపిల్లి మణికంఠ నిఖిల్, పాండ్రంకి సంపత్ స్వామిలకు గోల్డ్ మెడల్స్, మేడిశెట్టి గౌతంవర్ధన్ బ్రాంజ్ మెడల్ సాధించారు. డీఈఓను కలిసిన వారిలో కరాటే అకాడమీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పెంకి అశ్విని, వలస సాయి ప్రసాద్, హ్యూమన్ రైట్స్ ఏపీ ప్రధాన కార్యదర్శి పాండ్రంకి సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కాన రాని అడవి ఏనుగు

- రెండు నెలలుగా అదృశ్యం..
- ఏమైందని ప్రశ్నిస్తున్న జంతు ప్రేమికులు


అడవి ఏనుగు హరి (ఫైల్)

కురుపాం: ఒడిశా ప్రాంతం నుంచి ఆరేళ్ల కిందట గుంపుగా కురుపాం నియోజకవర్గంలోని అడుగుపెట్టిన అడవి ఏనుగుల్లో ఒకటైన హరి (మగ ఏనుగు) జాడ కానరావడం లేదు. చిన్న వయస్సులో గుంపుతోపాటు కురుపాం నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన మగఏనుగుతో అటవీశాఖ అధికారులు మమేకమై దానికి హరి అని పేరు పెట్టారు. గుంపులో హరి తెలివైనదిగా చెప్పుకుంటుంటారు. హరి అని పిలిచిన వెంటనే దగ్గరకు రావడం, దాహం వేస్తే స్వయంగా తాగునీటి బోరువద్దకు వెళ్లి కొట్టుకుని తాగడం వంటి పనులు చేస్తూ నియోజకవర్గ ప్రజలతో మమేకమైంది. అయితే రెండు నెలలుగా హరి జాడ కానరావడం లేదు. దీంతో అసలు హరి ఉన్నట్లా? లేక మృత్యువాత పడిందా? అన్నది తెలియడం లేదని జంతుప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. రెండు నెలలుగా జాడ లేని హరిని అటవీశాఖ అధికారులే గుర్తించాల్సి ఉందని అభిప్రాయ పడుతున్నారు.

సామాజిక తనిఖీలో వెలుగుచూసిన అవకతవకలు

పూసపాటిరేగ: ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో అవకతవకలు వెలుగుచూశాయి. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2022-23 సంవత్సరానికి సంబంధించి 1623 పనులకు గాను రూ. 2.37 కోట్లు ఖర్చు చేయడంపై డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల చెరువు పనులలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించి బాధ్యులకు అపరాధ రుసుం విధించారు. పూసపాటిరేగ ఫీల్డ్ అసిస్టెంట్ కె. అప్పలనాయుడు బినామీల పేరిట మస్టర్లు వేసి నిధులు స్వాహా చేయడంతో విధుల నుంచి సస్పెండ్ చేశారు. అలాగే రెల్లివలస ఫీల్డ్ అసిస్టెంట్ త్రినాథరావు పలు అవకతవకలు పాల్పడినట్లు గుర్తించారు. చనిపోయిన వ్యక్తుల పేరిట మస్టర్లు వేసి నిధులు డ్రా చేసినట్లు గుర్తించడంతో అతడ్ని కూడా సస్పెండ్ చేశారు. కుమిలి గ్రామానికి సంబంధించి హౌసింగ్ స్కీమ్‌లో అధికంగా మస్టర్లు వేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను మందలించారు. చల్లవానితోటతో పాటు పలు గ్రామాలలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు చనిపోయినా నిర్వహణ నిధులు డ్రా చేసినట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, ఉపాధి హామీ పథకం ఏపీడీ జనార్దనరావు, ఉపాధి హామీ పథకం విజిలెన్స్ అధికారి వెంకటనాయుడు, ఎస్ఆర్‌పీ అచ్యుతరావు, ఏపీఓ రత్నమాల, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, ఎడ్ల రామకృష్ణ, తాడిశెట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ తరలివచ్చిన వేళ

- పులకించిన భక్తజనం
- శంబరలో జాతర శోభ


అమ్మవారి ఘటాన్ని పట్టుకుని తీసుకువస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర


ప్రత్యేక అలంకరణలో పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పోలమాంబ అమ్మవారు శంబర గ్రామానికి తరలివచ్చిన వేళ..అమ్మవారి ఘటాలను చూసిన భక్తులు పులకించిపోయారు. ఘటాలకు ఎదురెళ్లి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, తప్పెటగుళ్లు, మహిళల కోలాటాలతో అమ్మ వారిని సోమవారం రాత్రి గ్రామంలోకి ఆహ్వానించారు. ఏటా జనవరి నెలలో జరగనున్న జాతరకు అమ్మవారు గ్రామానికి చేరుకోవడంతో జాతరశోభ సంతరించుకుంది. గోముఖినది ఆవలి ఒడ్డున ఉన్న అమ్మవారి గద్దెవద్ద పూజారి, కుప్పిల, గిరడ, మున్సిబ్ కుటుంబాల వారు, గ్రామ పెద్దలు ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను గ్రామంలోకి తీసుకువచ్చారు. అమ్మవారికి మంగళవారం కాళ్లనొప్పుల కారణంగా గ్రామంలోని చదురుగుడిలో విశ్రాంతి తీసుకుని, బుధవారం నుంచి 14రోజుల పాటు ఆలయంలో కొలువై పూజలందుకుంటారు. ప్రతి రోజూ సాయంత్రం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఘటాలకు గ్రామంలోని అన్ని వీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ఈనెల 22న తొలేళ్ల ఉత్సవం, 23న సిరిమానోత్సవం, 24న అనుపోత్సవం నిర్వహించి ఈనెల 30న మారు జాతర నిర్వహిస్తారు. ఇలా 10 వారాల పాటు అమ్మవారి జాతర సాగుతుంది. కార్యక్రమంలో ఈవో వి.వి.సూర్యనారాయణ, మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్‌లు పూడిదాలినాయుడు, గంజికాశీనాయుడు, వసంతుల భాస్కరరావు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, దేవాదాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘటాలను దర్శించుకున్న డిప్యూటీ సీఎం

శంబర పోలమాంబ అమ్మవారి ఘటాలను సోమవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర దర్శించుకున్నారు. గ్రామంలోకి అమ్మవారి ఘటాలు వస్తుండగా ఎదురుగా వెళ్లి అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు